సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 1 । ఆగస్టు । 2025


ప్రసన్న కుటుంబీకులకు ఆత్మీయ పలకరింపు

జననేతను చూసేందుకు హాజరైన అశేష జనవాహిని


న్యూస్‌రీల్

అనుమతులున్నా.. అడ్డుకొని


పూజిత కారును నిలిపేసిన పోలీసులు

వెంకటాచలం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు కూటమి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించింది. నెల్లూరు కేంద్ర కారాగారం వద్ద ఆయన దిగే హెలిప్యాడ్ వద్దకు అనుమతులతో వెళ్లే వారిని సైతం అడ్డుకునేందుకు పోలీసులు యత్నించారు. వాస్తవానికి హెలిప్యాడ్ వద్దకెళ్లేందుకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరెడ్డి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజితకు పోలీసుల అనుమతి ఉంది. అయినా వీరి కార్లను జాతీయ రహదారిపైనే నిలిపేశారు. పూజిత కారులోని మహిళా సిబ్బందిని దింపేసి వెళ్లాలంటూ హుకుం జారీ చేశారు. మహిళా సిబ్బందిని తమ వెంట తీసుకెళ్లనీయరానంటూ ఖాకీలను ఆమె ప్రశ్నించారు. ఇంత దుర్మార్గంగా వ్యవహరించడం తగదని ఆమె హితవు పలికారు. మీడియాపైనా ఆంక్షలు విధించి జాతీయ రహదారి వద్దే నిలిపేశారు. కార్లను నిలిపి తనిఖీ చేస్తుండగా.. ఫొటోలు, వీడియోలు తీసిన విలేకరులపై అసహనాన్ని ప్రదర్శించారు.

నెల్లూరులో రెడ్‌బుక్ కర్ఫ్యూ


బారికేడ్ల వద్ద పహారా కాస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నగరంలోని ప్రతి సెంటర్‌లో పోలీసులు బారికేడ్లు పెట్టి ప్రజలకు తీవ్ర ఇబ్బంది కల్పించారు. నగరంలోని ప్రధాన కూడళ్ల మొదలుకొని చిన్న వీధుల్లోనూ పోలీసులను మోహరించారు. ఉదయం ఐదు గంటల నుంచే అన్ని ప్రాంతాల్లో ప్రజల రాకపోకలపై ఇబ్బందులు సృష్టించడంతో సామాన్యులు ఇబ్బంది పడ్డారు. టూవీలర్స్‌ను కూడా వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకోవడం, షాపులు మూయించేయడంతో నగరమంతా కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. ఎక్కడికక్కడే వాహనాలను నిర్దాక్షిణ్యంగా నిలిపివేశారు. స్కూళ్లు, డ్యూటీలు, పనులకు వెళ్లేందుకు స్థానికులు అష్టకష్టాలు పడ్డారు.


అదిగో మీ మామ


నినాదాలు చేస్తున్న అవ్వలు

ఆంక్షలు దాటి.. జన సునామై..

అడ్డంకులు అధిగమించి.. కంచెలు ఛేదించి

- ముళ్ల పొదల్లోనూ కాలినడకన జైలు వద్దకు రాక
- అడుగడుగునా జయహో జగన్ నినాదాలు
- 8 కిలోమీటర్లు.. 2.14 గంటల ప్రయాణం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాకతో సింహపురి జన ఝరిగా మారింది. రాప్తాడు.. పొదిలి.. రెంటపాళ్ల.. బంగారుపాళ్యం.. ఇలా పర్యటన.. పర్యటనకు మించిన జన సునామీ నెల్లూరును తాకడం కూటమి నేతల్లో వణుకు పుట్టించింది. జననేత పర్యటనను అడ్డుకునేందుకు ఊరూరా ఆంక్షలు విధించినా.. పెద్ద సంఖ్యలో చెక్‌పోస్టులు.. అడుగడుగునా బారికేడ్లు.. ముళ్ల, ఇనుప కంచెలను నెలకొల్పినా.. రహదారులను ధ్వంసం చేసినా, ఇవేవీ పార్టీ అభిమానులను అడ్డుకోలేకపోయాయి. వారిని నిర్బంధించలేకపోయాయి. పార్టీ శ్రేణులు, ప్రజలను కట్టడి చేసేందుకు అనేక అడ్డంకులు సృష్టించినా.. ఖాకీలు లాఠీలను ఝుళిపించినా.. ఊహించని స్థాయిలో పోటెత్తారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జననేత జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విఫలం చేసేందుకు కూటమి నేతలు కుతంత్రాలు పన్నారు. పోలీసులను అడ్డంపెట్టుకొని ఆంక్షల ఛత్రాన్ని బిగించారు. హెలిప్యాడ్ నుంచి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటి వరకు ఎవరూ లేకుండా చేయాలనే దురుద్దేశంతో బారికేడ్లను ఎక్కడికక్కడ ఏర్పాటు చేశారు. అయితే వీరి కుట్రలు, పన్నాగాలు జన ప్రభంజనం ముందు చిన్నబోయాయి. పెద్ద ఎత్తున తరలివచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానుల జై జగన్, జైజై జగనన్న నినాదాలతో నెల్లూరు హోరెత్తింది.

అడుగడుగునా జనాభిమానం

చెముడుగుంటలోని హెలిప్యాడ్‌కు గురువారం ఉదయం 10.30కు చేరుకున్న జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన జిల్లా కేంద్ర కారాగారానికి 10.58కు చేరుకున్నారు. అక్రమ కేసులతో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖతయ్యారు. జిల్లా కేంద్ర కారాగారం నుంచి 11.26కు బయల్దేరి సుజాతమ్మ కాలనీలోని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి మధ్యాహ్నం 1.40కు చేరుకున్నారు. ఆయనతో పాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. టీడీపీ మూకలు సాగించిన విధ్వంసకాండపై వారిని ఆరాతీశారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మధ్యాహ్నం 2.48కు అక్కడి నుంచి బయల్దేరి హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. బెంగళూరుకు హెలికాప్టర్‌లో 3.15కు పయనమయ్యారు.

కూటమిలో కలవరం

జాతీయ రహదారి వెంబడి వాహనాలు బారులుదీరాయి. జగనన్నా అంటూ బస్సులు, లారీలు, కార్ల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున నినదించారు. ఆయన్ను చూసేందుకు వృద్ధులు, మహిళలు రోడ్లపైకొచ్చారు. చంద్రబాబు పాలన అత్యంత దారుణంగా ఉందని, తిరిగి మీరే సీఎం కావాలని నినాదాలు చేశారు. తల్లులు తమ పిల్లలకు ఆశీర్వాదం ఇప్పించారు. అశేష జనవాహినికి అభివాదం చేస్తూ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగారు. మొత్తమ్మీద జననేత పర్యటన కూటమి నేతల్లో కలవరాన్ని రేకెత్తిస్తోంది. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ గురుమూర్తి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మాజీ మంత్రులు నారాయణస్వామి, అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి విక్రమ్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బుర్రా మదుసూధన్‌యాదవ్, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, నెల్లూరు రూరల్, ఉదయగిరి, వెంకటగిరి సమన్వయకర్తలు ఆనం విజయకుమార్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కొండూరు అనిల్‌బాబు, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి, కాకాణి పూజిత, అనిల్‌కుమార్ రెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఖాకీల లాఠీన్యం


జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న పూజిత దంపతులు

బెదరని..

జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనతో నెల్లూరు నగరం జనసంద్రమైంది. ఆంక్షలు, అడుగడుగునా అవాంతరాలను పోలీసులు సృష్టించినా, పార్టీ శ్రేణులు, అభిమానులు ఏ మాత్రం లెక్క చేయలేదు. రెండుసార్లు లాఠీచార్జి చేసినా బెదరలేదు. తమ అభిమాన నేతను చూసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జిల్లా కేంద్ర కారాగారం నుంచి సుజాతమ్మ కాలనీలోని ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి చేరుకునేందుకే దాదాపు రెండు గంటలకుపైగా సమయం పట్టిందంటే ఏ స్థాయిలో అభిమానులు తరలివచ్చారో అర్థం చేసుకోవచ్చు. ఎండను సైతం లెక్కచేయకుండా ఉప్పెనలా తరలివచ్చారు. కాన్వాయ్ వెంబడి జై జగన్, జయహో జగన్.. సీఎం.. సీఎం అని నినదిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

అణువణువూ నిఘా

జిల్లా జైలు ప్రాంతం నుంచి ప్రసన్న ఇంటి వరకు దారిపొడవునా సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో పోలీసులు నిఘా పెట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి భద్రత కంటే.. జనాన్ని కట్టడి చేసేందుకే ప్రాధాన్యమిచ్చారు.


రోప్ పార్టీతో ప్రజలను కట్టడి చేస్తూ..

ఖాకీల ఓవరాక్షన్.. ప్రజల అవస్థ


షాపు మూయమంటూ పోలీస్ దబాయింపు

నెల్లూరు(బృందావనం): వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన సందర్భంగా పోలీసులు అనుసరించిన తీరుతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. జాతీయ రహదారిపై బారికేడ్లను ఏర్పాటు చేయడంతో కావలి వైపు వెళ్లే మార్గంలో భారీ వాహనాల వారి అగచాట్లు వర్ణనాతీతమయ్యాయి. ఉదయం ఎనిమిది నుంచే విడతల వారీగా ట్రాఫిక్‌ను నియంత్రించారు. జిల్లా కేంద్ర కారాగారం వద్ద కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖతయ్యాక సుజాతమ్మ కాలనీలోని నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని పరామర్శించేందుకు వస్తున్నప్పుడూ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జాతీయ రహదారిపై ఇదే పోకడను అవలంబించారు. ఫలితంగా ముండుటెండలో వాహనచోదకులు మగ్గాల్సి వచ్చింది.

స్వామి భక్తిని చాటుకొని..

మాజీ ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, ఎమ్మెల్సీలను సైతం పోలీసులు అడ్డుకొని తమ స్వామిభక్తిని చాటుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, గూడూరు మున్సిపాల్టీ మాజీ చైర్‌పర్సన్ కోడూరు కల్పలత, మీరారెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ మేరిగ మురళి, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి ఇలా ప్రతి ఒక్కరి వాహనాలను నిలిపేశారు. అనుమతి పత్రాలను పరిశీలించి, ప్రతి ఒక్కరి పేరును చూసి.. సహాయకులెవరీన్నీ అనుమతించేది లేదంటూ నిర్దాక్షిణ్యంగా దించేశారు. డీఎస్పీ గిరిధర్, సీఐలు షముల్లా, సుధాకర్‌రెడ్డి తదితరులు తామేమీ చేయలేమంటూ చేతులెత్తేశారు. దీంతో అనుమతులున్న వారే జిల్లా కేంద్ర కారాగారం వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

విద్యార్థులనూ వేధించి..

జిల్లా కేంద్ర కారాగారానికి వెళ్లే మార్గంలోనే ఉన్న నారాయణ జూనియర్ కళాశాల వద్దకు విద్యార్థినులు, వారు పయనించే ఆటోలను అనుమతించలేదు. దీంతో జాతీయ రహదారి నుంచి కాలేజీకి విద్యార్థులు నడుచుకొని వెళ్లాల్సి వచ్చింది.


మేడెక్కిన అభిమానం


కేరింతలు కొడుతూ..


కరచాలనానికి పోటీ పడుతూ..


పెనుగులాటలో కిందపడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి


జగన్‌ను కలిసిన అనిల్


పుష్పగుచ్ఛం అందజేసిన ఆనం విజయకుమార్‌రెడ్డి, అరుణమ్మ


జగన్‌తో మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి


జంకె వెంకట్‌రెడ్డి


రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


తూమాటి మాధవ్‌రావు


మేకపాటి విక్రమ్‌రెడ్డి

జననేతకు ఘన స్వాగతం

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం చెముడుగుంట హెలిప్యాడ్‌ వద్ద వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు, నేతలు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. నాయకులను జగన్‌ ఆప్యాయంగా పలకరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి


మేరిగ మురళి


మేకపాటి రాజగోపాల్‌రెడ్డి


నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి


బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి


బుర్రా మధుసూదన్‌ యాదవ్‌


కొండూరు అనిల్‌బాబు


పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

లారీని తప్పించబోయి..

- రోడ్డు ప్రమాదంలో ట్రావెల్స్‌ బస్సు డ్రైవర్‌ మృతి


డ్రైవర్‌ రాజు మృతదేహం

కావలి(జలదంకి): రోడ్డు ప్రమాదంలో ఓ ట్రావెల్స్‌ బస్సు డ్రైవర్‌ మృతిచెందాడు. కావలి రూరల్‌ పోలీసుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన కోదాటి రాజు (47) ట్రావెల్స్‌ బస్సు డ్రైవరుగా పని చేస్తున్నాడు. అతడికి భార్య సంధ్య, ముగ్గురు పిల్లలున్నారు. బుధవారం సాయంత్రం 4:45 గంటలకు రాజు ఏలూరు నుంచి బెంగళూరుకు బయలుదేరిన బస్సుకు డ్రైవర్‌గా ఉన్నాడు. రాత్రి 11:50 గంటల సమయంలో కావలి మండలం అడవిరాజుపాళెం దాటిన తర్వాత పెట్రోల్‌ బంకు సమీపంలో జాతీయ రహదారిపై లారీ వెళ్తోంది. దాని డ్రైవర్‌ ఒక్కసారిగా బ్రేక్‌ వేశాడు. దీంతో రాజు లారీని తప్పించేందుకు స్టీరింగ్‌ను ఎడమవైపునకు తిప్పాడు. ఆ సమయంలో మరో లారీ వెళ్తుండగా దానిని బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు స్టీరింగ్, సీటు మధ్యలో ఇరుక్కుని మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కావలి రూరల్‌ సీఐ రాజేశ్వరరావు గురువారం తెలిపారు.

స్వగ్రామానికి వెళ్తుండగా..

- స్కూటీని ఢీకొట్టిన మినీలారీ
- బేల్దారి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

కావలి(జలదంకి): కావలి రూరల్‌ మండలం గౌరవరం సమీపంలోని అటవీ మొక్కల పెంపక కేంద్రం వద్ద జాతీయ రహదారిపై గురువారం స్కూటీని వెనుక నుంచి చిన్న మినీలారీ ఢీకొట్టింది. దీంతో మనకే ఉదయ్‌కిరణ్‌ (24) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మనకే మహేష్‌ తీవ్రంగా గాయపడ్డాడు. రూరల్‌ పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం చెన్నుపాడుకు చెందిన మహేష్‌ నాయుడుపేటలో బేల్దారి పనులు చేయిస్తుంటాడు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన కొంతమందితోపాటు వరుసకు సోదరుడైన ఉదయ్‌కిరణ్‌ను కొంతకాలంగా నాయుడుపేటకు తీసుకెళ్లి పనులు చేయిస్తున్నాడు. మహేష్‌ చెల్లెలుకు పెళ్లి కుదిరింది. అతడితోపాటు ఉదయకిరణ్‌ స్కూటీపై స్వగ్రామానికి బయలుదేరారు. గౌరవరం వద్ద జాతీయ రహదారిపై మినీలారీ స్కూటీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉదయ్‌కిరణ్‌ తలపై కంటైనర్‌ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన మహేష్‌ను చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. ఉదయ్‌కిరణ్‌ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి తిరుపాలు ఫిర్యాదు మేరకు రూరల్‌ ఎస్సై తిరుమలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

5,489 కొత్త పింఛన్ల మంజూరు


నెల్లూరు(పొగతోట): జిల్లాలో 5,489 కొత్త పింఛన్లు మంజూరు చేయడం జరిగిందని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి సాధారణ పింఛన్‌తోపాటు కొత్తవి పంపిణీ చేస్తామని తెలియజేశారు.

పురాతన ఆలయ పరిశీలన


ఆలయం వద్ద అధికారులు

సోమశిల: చేజర్ల మండల పరిధిలోని పెరుమాళ్లపాడు పెన్నా నదిలో బయటపడిన నాగేశ్వర స్వామి ఆలయాన్ని గురువారం రాష్ట్ర దేవదాయ శాఖ స్థపతి పరమేశ్వరప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం కోసం అవసరమైన నిధులు, స్థల పరిస్థితులు, నిర్మాణ అవసరాలు, పురాతన శిల్పకళ ప్రాముఖ్యత, సంబంధించిన వాటిపై అధ్యయనం చేసి, తగిన ప్రతిపాదనలతో నివేదిక సిద్ధం చేశామన్నారు. ఆయన వెంట సహాయ స్థపతి సురేంద్ర, గుంటూరు జిల్లా డీఈఈ సీహెచ్‌ శ్రీనివాసులు, నెల్లూరు జిల్లా ఏఈఈ ఎ.మురళిమోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు


దేవుడి విగ్రహం వెనుక వైపు తవ్వకాలు

సైదాపురం: మండలంలోని తోచాం గ్రామంలో పురాతన శ్రీకృష్ణుని ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గురువారం గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా స్థానికులు పట్టుకునేందుకు ప్రయత్నించగా ఉడాయించాడు. ఊరి పొలిమేరల్లో అమ్మవారి బొమ్మ వేసి పూజలు చేసిన ఆనవాళ్లను గుర్తించారు. దీంతో గ్రామస్తులు ఆలయానికి వెళ్లి పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు పూజలు చేసి విగ్రహాల వెనుకవైపు తవ్వకాలు చేశారు. కొద్దిరోజుల నుంచి సమీప ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఆలయ పరిసర ప్రాంతలతోపాటు గ్రామంలో సంచరించినట్లు గుర్తించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జిల్లా పరిషత్‌లో పదోన్నతులు


పదోన్నతులు, ఉద్యోగాలు పొందిన వారితో అరుణమ్మ, మోహన్‌రావు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్‌ యాజమాన్య పరిధిలో పనిచేస్తున్న ఆరుగురు సీనియర్‌ సహాయకులకు పదోన్నతులు కల్పించారు. ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్‌ ఆనం అరుణమ్మ, సీఈఓ మోహన్‌రావు గురువారం అందించారు. వెంకటరమణయ్య, సీహెచ్‌ రామకృష్ణ, షేక్‌ ఇలియాజ్, ఎం.లీలామోహన్, ఎం.సుదర్శన, ప్రసన్నకుమార్‌ ప్రమోషన్‌ పొందిన వారిలో ఉన్నారు.

కారుణ్య నియామకాలు

ఇద్దరు ఉద్యోగాలు మరణించగా వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించారు. ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ మాట్లాడుతూ 2024 ఏడాది నుంచి ఇప్పటివరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్న 120 మందికి పదోన్నతులు కల్పించామన్నారు. 81 మంది ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాల ద్వారా అవకాశాలు ఇచ్చామన్నారు. ఉద్యోగులు, పంచాయతీరాజ్‌ మినిస్టీరియల్‌ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ నాయకులు లక్కాకుల పెంచలయ్య, వి.ప్రసన్నకుమార్‌ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



నకిలీ ఏటీఎం కార్డులిచ్చి..

- అసలు వాటితో నగదు కొల్లగొడుతున్న వ్యక్తి
- పోలీసులకు అప్పగించిన స్థానికులు


ఏటీఎం కార్డులు పరిశీలిస్తున్న ఎస్సై ఎస్‌కే జిలానీ

ఆత్మకూరు: నగదు తీసుకునేందుకు ఏటీఎంల వద్దకు వెళ్లే వారిని మోసం చేసి కార్డు, పిన్‌ నంబర్లను తెలుసుకుని నగదు దోచుకుంటున్న వ్యక్తిని కొందరు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. స్థానికులు, ఎస్సై జిలానీ కథనం మేరకు.. ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం మట్టిపాడు గ్రామానికి చెందిన సురేంద్ర అనే యువకుడు ఏటీఎంల వద్ద ప్రజలను ఏమారుస్తుంటాడు. నగదు విత్‌డ్రా చేయాలని కోరుతూ కార్డులిచ్చే వారిని మోసం చేస్తుంటాడు. పిన్‌ నంబర్‌ తెలుసుకుని నకిలీ కార్డు చేతిలో పెడుతుంటాడు. గురువారం ఆత్మకూరు మున్సిపల్‌ బస్టాండ్‌ సమీపంలోని ఓ బ్యాంక్‌ ఏటీఎం వద్ద వృద్ధుడికి నగదు తీసుకోవడంలో సహాయం చేస్తానని నమ్మించాడు. ఆయన కార్డు తీసుకుని పిన్‌ నంబర్‌ తెలుసుకుని నగదు డ్రా చేసి నకిలీ కార్డు ఇచ్చాడు. కొద్దిసేపటి అనంతరం మరో యువకుడికి ఇలానే చేయబోగా సురేంద్ర మోసాన్ని పసిగట్టి సమీపంలోని వారి సహకారంతో పట్టుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై పరిశీలించగా సురేంద్ర వద్ద పలు నకిలీ ఏటీఎం కార్డులు లభించాయి. అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. ఇప్పటికే కేసులు నమోదైనట్లు గుర్తించారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు


మాట్లాడుతున్న పీడీ హేనాసుజన్‌

నెల్లూరు(పొగతోట): అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించాలని ఐసీడీఎస్‌ పీడీ హేనాసుజన్‌ సీడీపీఓలను ఆదేశించారు. గురువారం నెల్లూరులోని కార్యాలయంలో సీడీపీఓలతో నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలు పిల్లల ఆరోగ్యానికి, ఎదుగుదలకు ఎంత అవసరమో అవగాహన కల్పించాలన్నారు. పూర్తిస్థాయిలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో వారోత్సవాలను జరపాలన్నారు. శుక్రవారం కలెక్టర్‌ ఆనంద్‌ కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలియజేశారు.

1,86,368 మందికి 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్‌'

- కలెక్టర్‌ ఆనంద్‌

నెల్లూరు రూరల్‌: జిల్లాలో 1,86,368 మందికి అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్‌ పథకం కింద నిధులను ఈనెల 2వ తేదీన సీఎం చంద్రబాబు నాయుడు జమ చేస్తారని కలెక్టర్‌ ఆనంద్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌలు రైతులకు రూ.10,000 వేల చొప్పున రెండు విడతల్లో ఇస్తారని తెలియజేశారు. 1,86,368 రైతు కుటుంబాలకు 2025 – 26 సంవత్సరానికి మొదటి విడత రూ.5,000లు అందిస్తారన్నారు. మొదటి విడతలో అర్హత పొందలేని రైతులు, కారణం తెలుసుకుని సరిచేసుకుంటే రెండో విడత లోపు సంబంధిత సైట్‌లో నమోదు చేస్తారన్నారు.


కుటుంబాల్లో బెల్టు షాపుల చిచ్చు


గ్రామంలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు తదితరులు

ఉదయగిరి: కూటమి ప్రభుత్వం గ్రామగ్రామాన బెల్టు షాపులు ఏర్పాటు చేసి పచ్చని సంసారాల్లో చిచ్చురేపి నాశనం చేస్తోందని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివమ్మ, మస్తాన్‌బీ అన్నారు. వారు గురువారం మండలంలోని కృష్ణారెడ్డిపల్లెలో జరిగిన ఉదయగిరి ప్రాంత ఐద్వా 3వ మహాసభలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో మంచినీరు దొరకపోయినా పుష్కలంగా దొరుకుతోందన్నారు. బెల్టు షాపులతో మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటిని అరికట్టాల్సిన ప్రభుత్వ అధికారులు మిన్నకుండిపోవడం దారుణమన్నారు. కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్‌ హామీలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. భవిష్యత్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. అనంతరం 13 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బెల్టు షాపులు ఎత్తివేయాలని ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఎంపీటీసీ విజయమ్మ, నాయకులు కామాక్షమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 26.413 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 26.413 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,750, పిన్నేరు కాలువకు 20, లోలెవల్‌ కాలువకు 70, మొదటి బ్రాంచ్‌ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.24
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు

బ్రాయిలర్:	రూ.121
లేయర్‌	రూ.112
బ్రాయిలర్‌ చికెన్:	రూ.220
స్కిన్‌లెస్‌ చికెన్:	రూ.244
లేయర్‌ చికెన్:	రూ.190



ఐటీ విభాగం రాష్ట్ర కమిటీలో చోటు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ ఐటీ విభాగం రాష్ట్ర కమిటీలో పలువురికి అవకాశం కల్పించినట్లు కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కార్యదర్శిగా గూడూరు నియోజకవర్గానికి చెందిన కొప్పర్తి ఓబయ్య, జాయింట్‌ సెక్రటరీగా సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన పాతపాటి హేమంత్‌రెడ్డి నియమితులయ్యారు.

ఎస్సైపై ఎస్పీకి ఫిర్యాదు

ఉలవపాడు: మండల పరిధిలోని మన్నేటికోట గ్రామానికి చెందిన గొత్తుల నాగమణి అనే మహిళ ఎస్సై అంకమ్మపై గురువారం ఆన్‌లైన్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాలు.. నాగమణి ఇంటి పక్కన తారు డబ్బాలు ఉన్నాయంటూ ఎస్సైతోపాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో పురుషులు లేరు. నీ భర్త వెంకట్రావు ఎక్కడికి వెళ్లాడంటూ పోలీసులు అసభ్యంగా మాట్లాడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళా కానిస్టేబుళ్లు కూడా లేకుండా బుధవారం సాయంత్రం 7 గంటలకు, 10 గంటలకు, గురువారం ఉదయం 9 గంటల సమయంలో ముగ్గురు కానిస్టేబుళ్లు వచ్చి ఇంటిని తనిఖీ చేశారని తెలిపింది. రాత్రి సమయంలో వంటగదిలో ఉన్న బాక్స్‌ తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. రాజకీయ కక్షలో భాగంగా పోలీసులు వేధిస్తున్నారని ఆమె ఫిర్యాదు చేశారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

నెల్లూరు రూరల్‌: అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేసేందుకు జాయింట్‌ ఎల్‌పీఎంలను సబ్‌ డివిజన్‌ చేసేందుకు దరఖాస్తుల గడువును డిసెంబర్‌ 31వ తేదీ వరకు పొడిగించినట్లు కలెక్టర్‌ ఓ.ఆనంద్‌ గురువారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌ ద్వారా అందించే ఈ సేవలు పూర్తిగా ఉచితమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అట్యా - పాట్యా జట్ల ఎంపికలు రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అట్యా – పాట్యా అండర్‌ – 17 బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు నెల్లూరు ఏసీ నగర్‌లోని మల్లెల సంజీవయ్య మున్సిపల్‌ స్కూల్లో శనివారం సాయంత్రం 3 గంటలకు జరుగనున్నాయని ఆ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలోని ఏబీఎం స్టేడియంలో ఈనెల 9, 10వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. క్రీడాకారులు తమ వయసుకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలన్నారు. వివరాలకు 94935 82143, 99661 91956 ఫోన్‌ నంబర్లను సంప్రదించాలని కోరారు.